క్లుప్తంగా

నాగారప్పమ్మకు ప్రత్యేక పూజలు

వరికుంటపాడు: పెద్దిరెడ్డిపల్లిలోని నాగారప్పమ్మ ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. భక్తులు ఉపవాస దీక్షలతో ఆలయానికి చేరుకుని అమ్మవారికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు.

జాబ్‌మేళా రేపు

ఉదయగిరి: పట్టణంలోని మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం పది గంటల నుంచి జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్ నారాయణస్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ ఇన్ఫోటెక్, అల్‌ట్రస్ట్ టెక్నాలజీ ఇండియా కంపెనీల ప్రతినిధులు జాబ్‌మేళాకు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగావకాశాలు కల్పిస్తారని వివరించారు. పదో తరగతి నుంచి డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీటెక్ పూర్తి చేసిన నిరుద్యోగ యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈద్గాలో పనుల పరిశీలన



ఉదయగిరి: రంజాన్‌ను పురస్కరించుకుని ఉదయగిరిలోని ఈద్గాను శుభ్రం చేసే కార్యక్రమానికి సర్పంచ్ పీ సామ్రాజ్యం, ఉపసర్పంచ్ ముర్తుజా హుస్సేన్ ఆదివారం శ్రీకారం చుట్టారు. పంచాయతీ కార్యదర్శి షేక్ కరిముల్లా పనులను పర్యవేక్షిస్తున్నారు. ఈద్గాలో జరిగే ప్రార్థనలకు హాజరయ్యే ముస్లింలకు వసతులు కల్పించే నిమిత్తం స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు ఎస్కే యస్దాని, గడియాల్చి యస్దాని, ఉప్పుటూరి శ్రీను, గొల్లపల్లి తిరుపతి, తదితరులు సర్పంచ్‌తో కలిసి పరిశీలించారు.

ఇఫ్తార్ విందు

కావలి: రంజాన్ సందర్భంగా పట్టణంలోని జెండా చెట్టు సెంటర్‌లోని మసీదులో ఇఫ్తార్ విందును ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ నెల 28వ తేదీ తన నివాసంలో ఏర్పాటు చేస్తున్న ఇఫ్తార్ విందులో నియోజకవర్గంలోని ముస్లింలందరూ పాల్గొనాలని కోరారు.

రంజాన్ రేషన్ కిట్ల పంపిణీ



కావలి: పట్టణంలోని తుఫాన్‌నగర్‌లోని జమాతె ఇస్లామి హింద్ కార్యాలయంలో రంజాన్‌ను పురస్కరించుకుని నిరుపేద కుటుంబాలకు రేషన్ కిట్లను ఆదివారం పంపిణీ చేశారు. 35 కుటుంబాలకు నిత్యావసర సరుకులు, చీరలు పంపిణీ చేసినట్లు జమాతే ఇస్లామి హిందు కావలి బాధ్యులు మహబూబ్‌బాషా తెలిపారు. సభ్యులు మహమ్మద్ ఫాతిమా, షేక్ బుష్రా, షేక్ షాహీనా, షేక్ హబీబా, షేక్ చాంద్‌బాషా, ఎస్కే జిలానీ బాషా, షేక్ ఫయాజ్, షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.

వృద్ధులకు సరుకుల పంపిణీ



కావలి: పట్టణంలోని వెంగళరావునగర్‌లో ఉన్న డీఆర్ విశ్వోదయ సేవాసమితి కార్యాలయంలో 60 మంది నిరుపేద వృద్ధులకు నిత్యావసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ మౌలాలి ముఖ్యఅతిథిగా హాజరై ప్రతినెలా డీఆర్ పేరు మీద నిరుపేద వృద్ధులకు నిత్యావసర సరుకులను అందజేసి ఆదుకుంటున్న డీఆర్ కుమారులు వినయ్‌కుమార్‌రెడ్డి, విద్యాధర్ కుమార్‌రెడ్డి అభినందించారు. విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయకుమార్‌రెడ్డి, డాక్టర్ మౌలాలి కుటుంబ సభ్యులు దిల్షాద్ బేగం మౌలాలీ, సావన్, సేవాసమితి డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సభ్యులు నల్లూరు రామకృష్ణ, సతీష్‌సింగ్ పాల్గొన్నారు.

29న ఉచిత వైద్యశిబిరం

ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరులో ఈ నెల 29న శ్రీవెంకటేశ్వర మహిమ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆ ట్రస్ట్ చైర్‌పర్సన్ గుండ్రా పద్మావతి, కార్యనిర్వాహకులు మహిమలూరు శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ గుండ్రా సతీష్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. అపోలో ఆస్పత్రి వైద్యులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు. రోగులకు భోజన సదుపాయాన్ని కల్పిస్తున్నామని చెప్పారు. మహిమలూరు పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

కలిగిరి: మండలంలోని పోలంపాడు, వీరారెడ్డి పాళెం, పెద్దపాడు గ్రామాల్లో త్రైత సిద్ధాంత–ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం ప్రచారం నిర్వహించారు. 100 భగవద్గీత గ్రంథాలతో పాటు తెలుగు ఉగాది క్యాలెండర్లను పంపిణీ చేశారు. సమితి సభ్యులు ప్రసాద్, సుధాకర్, పెంచలరత్నం, రమణారెడ్డి, వెంకటసుబ్బమ్మ, రమ్యశ్రీ పాల్గొన్నారు.

పుట్టి ముంచిన దళారులు

- మిల్లర్లతో కుమ్మక్కై ధరలు తగ్గింపు
- రబీ సీజన్‌లో భారీగా పెరిగిన పెట్టుబడులు
- తగ్గిన దిగుబడులు
- గతేడాదితో పోలిస్తే పుట్టికి రూ.5వేల మేర నష్టపోయిన అన్నదాతలు



ఈ ఫొటోలో ఉన్న కావలి రూరల్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన రైతు పేరు చిమ్మిలి వెంకటేశ్వర్లు. ప్రస్తుత రబీ సీజన్‌లో 4 ఎకరాల్లో కేఎస్‌ఎం 1638 రకం వరి సాగు చేశారు. ఎకరాకు 3.5 పుట్ల చొప్పున 14 పుట్లు ధాన్యం దిగుబడి వచ్చింది. పుట్టి ధాన్యాన్ని రూ.17,600 చొప్పున దళారులకు విక్రయించారు. గత రబీ సీజన్‌లో పుట్టి ధాన్యాన్ని 22,500కు అమ్మారు. కాగా పుట్టికి రూ.5వేలు చొప్పున 14 పుట్లకు రూ.70వేలు ఈ రబీ సీజన్‌లో నష్టపోయారు.



కావలి మండలం రాజువారిచింతపాళెంలో ధాన్యం ఆరబోస్తున్న రైతు



కొత్తపల్లిలో దళారీకి విక్రయించేందుకు సిద్ధం చేసిన ధాన్యం

కావలి: ఈ ఏడాది రబీ సీజన్‌లో ధాన్యం దిగుబడులు తగ్గాయి. అయినా ధరలు లేవు. గత రబీ సీజన్‌తో పోలిస్తే బాగా ధరలు పతనమయ్యాయి. ధాన్యం దిగుబడులు ఎందుకు తగ్గాయో వ్యవసాయాధికారులు శాస్త్రీయంగా ప్రకటించడం లేదు. ధాన్యం ధరలు ఎందుకు పతనమయ్యాయో ప్రభుత్వం కూడా ధైర్యంగా చెప్పడం లేదు. రైతులు మాత్రం దిక్కుమొక్కు లేని వారిలా పెట్టుబడులు, రెక్కల కష్టాన్ని పోగొట్టుకుని దీనంగా ఉండిపోతున్నారు.

లక్ష ఎకరాలకుపైగా సాగు

కావలి నియోజకవర్గంలో ఈ ఏడాది రబీ సీజన్‌లో లక్ష ఎకరాలకుపైగా వరి సాగు చేశారు. ప్రస్తుతం వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. సగటున ఎకరాకు 4 పుట్లు ధాన్యం దిగుబడి రావాల్సి ఉండగా చాలా చోట్ల 3 పుట్లు మాత్రమే వచ్చాయి. పెట్టుబడి ఎక్కువ పెట్టిన రైతులకు మాత్రం 3.5 పుట్లు వచ్చాయి. రబీ సీజన్ ప్రారంభం నుంచి రైతులకు సాగు పనుల్లో ప్రతి సందర్భంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించి అప్రమత్తం చేయడంలో వ్యవసాయాధికారులు విఫలమయ్యారు. కానీ గ్రామాల్లో విస్తృతంగా పొలాలను సందర్శించినట్లుగా రికార్డుల్లో మాత్రం రాసుకున్నారు. దీంతో ధాన్యం దిగుబడులు భారీగా తగ్గాయి. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో ప్రభుత్వం కూడా వ్యవసాయాధికారులను నివేదికలు కోరింది. అయితే రైతుల నిర్లక్ష్యం వల్లనే దిగుబడులు తగ్గాయని వ్యవసాయాధికారులు నివేదికలు అందజేసి తప్పించుకుంటున్నారు.

వింతగా వ్యవసాయాధికారుల నివేదికలు

ధాన్యం దిగుబడులు తగ్గడంపై వ్యవసాయాధికారులు ప్రభుత్వానికి ఇస్తున్న నివేదికలు వింతగా ఉన్నాయి. కావలి నియోజకవర్గంలో షుగర్‌లెస్ (ఆర్‌ఎన్‌ఆర్15048), కేఎస్‌ఎం1638 రకం వరి సాగు చేశారు. నారు పోసిన 20 రోజుల్లో కేఎస్‌ఎం 1638 రకం నాట్లు వేయాలి. అదే షుగర్ లెస్ రకం నారు పోసిన 25 రోజుల్లో నాట్లు వేయాలి. కానీ రైతులు కాల పరిమితులను అనుసరించలేదని, అందువల్లనే ధాన్యం దిగుబడులు తగ్గాయని చెప్పి వ్యవసాయాధికారులు చేతులు దులుపుకుంటున్నారు. వరి సాగు అనేది ఒక్కో ప్రాంతంలో నెలకొని ఉండే వాతావరణ పరిస్థితులను బట్టి సాగు చేసే విత్తనాన్ని ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. వ్యవసాయ శాస్త్రవేత్తలు ఇదే విషయాన్ని బలంగా చెబుతారు. వ్యవసాయాధికారులు క్షేత్ర స్థాయిలో విస్తృతంగా పర్యటించి ఏఏ ప్రాంతాల్లో ఏఏ రకం వరి విత్తనాలు నారు పోసుకోవాలి.. నారు పోసిన ఎంత కాలానికి నాట్లు వేసుకోవాలి..పైరు ఏఏ దశలో ఉన్నప్పుడు ఏఏ రకాల చీడ పీడలు సోకుతాయి..తదితర అంశాలపై ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేయాలి. కానీ వ్యవసాయాధికారులు మొక్కుబడిగా పొలం బడులు నిర్వహించి చేతులు దులుపుకొన్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో రబీ సీజన్‌లో వరి పంటకు చీడ,పీడలు పెద్ద ఎత్తున సోకాయి. వాటి నుంచి పైరును రక్షించుకోవడానికి ఈ సీజన్‌లో అదనంగా ఎకరాకు రూ.10వేల వరకు పెట్టుబడి పెరిగింది. పెట్టుబడులు పెరగడం, ధాన్యం దిగుమతులు తగ్గడంతో రైతులు తీవ్ర మనోవ్యధకు గురవుతున్నారు. ఈ క్రమంలో ధాన్యం ధరలు పతనం కావడంతో మరింత డీలా పడిపోతున్నారు.

మిల్లర్లతో కుమ్మక్కైన దళారులు

కావలి నియోజకవర్గంలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతుల వద్ద ధాన్యం నిల్వలు ఉన్నాయి. దీన్ని ఆసరాగా చేసుకుని దళారులు సిండికేట్‌గా మారారు. మిల్లర్లతో కుమ్మక్కై వారి ధాన్యాన్ని అడగడం లేదంటూ ప్రచారం చేసి రైతులను నమ్మించి ధాన్యం ధరలు పూర్తిగా తగ్గించారు. దీనికి తోడు అనేక నిబంధనలతో కూడిన ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కూడా బయట మార్కెట్ కన్నా కేవలం రూ.2వేలు మాత్రమే తేడాతో ధర ఉండడంతో రైతులు ఉసూరుమంటూ దళారులకే ధాన్యాన్ని అమ్ముతున్నారు.

పుట్టికి రూ.5వేల మేర నష్టం

గత ఏడాది రబీ సీజన్‌లో ధాన్యం పుట్టి ధర రూ.22,500 వరకు ఉండగా, ప్రస్తుత రబీ సీజన్‌లో రూ.17,500కు చేరింది. దీంతో రైతులు పుట్టికి రూ.5వేల మేర నష్టపోతున్నారు. అంటే ఎకరాకు రూ.15వేల నుంచి రూ.20వేల వరకు నష్టపోతున్నారు. ఈ ఏడాది అదనంగా పెట్టుబడిన రూ.10వేలు కూడా కలుపుకొంటే ఎకరాకు రూ.25వేల నుంచి రూ.30వేల వరకు రైతులు నష్టపోయారు.

ధరలు ఘోరం



ఏటా నాకు వరి సాగుకు ఎకరాకు రూ.27వేలు ఖర్చు అయ్యేది. ఈ రబీ సీజన్‌లో ఎకరాకు రూ.36వేలు ఖర్చు అయింది. పంటకు చీడ పీడలు ఎక్కువగా సోకడంతో ఊపిరి సలపకుండా మందులు పిచికారీ చేయాల్సి రావడంతో పెట్టుబడులు ఎక్కువయ్యాయి. ఈ రబీ సీజన్‌లో మిగిలింది ఏమీ లేదు. దిగుబడులు లేవు. దీనికి తోడు ధాన్యం ధరలు ఘోరంగా ఉన్నాయి. పుట్టి రూ.17,500కు అమ్మాను. గతేడాది రబీ సీజన్‌లో పుట్టి రూ.23వేలకు అమ్మాను.

–క్రిష్ణయ్య, రైతు, కొత్తపల్లి, కావలి మండలం

ఏమీ మిగల్లేదు



ఈ రబీ సీజన్‌లో కౌలుకు తీసుకుని వరి సాగు చేశా. పంట సాగుకు పెట్టుబడులు బాగా పెరిగాయి. అందకనుగుణంగా ధాన్యం దిగుబడులు రాలేదు. దీనికి తోడు పంట చేతికొచ్చే సరికి ధాన్యం ధరలు పతనమవడంతో రెక్కల కష్టం కూడా మిగల్లేదు. ఎకరాకు రూ.35వేల వరకు నష్టపోయా. సేద్యం చేయాలంటేనే భయమేస్తోంది.

–ఓరుగంటి వెంకటేశ్వర్లు, కౌలు రైతు, కావలి మండలం

విప్లవ వీరుల ఆశయాలను కొనసాగిద్దాం



కావలి: భగత్‌సింగ్‌కు నివాళులర్పించిన సీపీఎం నాయకులు

కావలి: దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలర్పించిన విప్లవ యువకిశోరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ఆశయాల కొనసాగించాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందని సీపీఎం సీనియర్ నాయకుడు తాళ్లూరు మాల్యాద్రి పేర్కొన్నారు. విప్లవవీరుల వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని జనతాపేటలో ఉన్న భగత్ విగ్రహానికి సీపీఎం నాయకులు ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ పోరాట స్ఫూర్తితో విద్యార్థులు, యువజనుల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు సాగిస్తామన్నారు. నాడు దేశ స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, లౌకికవాద పరిరక్షణ కోసం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వంటి అనేక మంది ప్రాణత్యాగాలు చేశారని గుర్తుచేశారు. నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజకీయ స్వలాభం కోసం కులాలు, మతాల మధ్యన చిచ్చుపెడుతూ పబ్బం గడుపుకుంటోందని విమర్శించారు. దేశంలోని ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తూ కార్పొరేట్ రంగాలకు యువతతో ఊడిగం చేయించేందుకు కుట్ర పన్నుతోందన్నారు. దేశానికి వెన్నెముక వంటి రైతులు సైతం ఆందోళన బాట పట్టే విధంగా చేసిన ఘన చరిత్ర మోడీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై యువతను చైతన్యపరిచి వ్యతిరేకంగా పోరాటాలు చేయిస్తామని హెచ్చరించారు.

కలిగిరి: స్థానిక టీడీపీ కార్యాలయంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత నందనవనం ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో విప్లవ వీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌కు నివాళులర్పించారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ బిజ్జం ఖాజాకుమారి, రవీంద్రారెడ్డి, కొండలరావు, చిరంజీవి, రాంమోహన్, వెంకటసుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయస్థాయి టెన్నిస్ పోటీలు



కావలి: కావలి టెన్నిస్ అసోసియేషన్లు, అఫీషియల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలో రెండు రోజుల పాటు నిర్వహించిన డాక్టర్ సీఎల్ఎన్‌రెడ్డి, సుజనమ్మ ట్రస్ట్ జాతీయస్థాయి ఇన్విటేషన్ డబుల్స్ టెన్నిస్ టోర్నీ ఆదివారం రాత్రితో ముగిసింది. 30 ప్లస్ విభాగంలో హైదరాబాద్‌కు చెందిన మాజ్, భూపాల్ విజేతలుగా, రన్నర్లుగా కడపకు చెందిన దస్తగిరి, అశోక్‌రెడ్డి నిలిచారు. 40 ప్లస్ విభాగంలో కావలికి చెందిన సిరిరెడ్డి, కృష్ణప్రసాద్ విజేతలుగా, విజయవాడకు చెందిన రాజేంద్ర, సంపత్ రన్నర్‌గా నిలిచారు. 50 ప్లస్ విభాగంలో కావలికి చెందిన వంశీమోహన్, కృష్ణ ప్రసాద్ విజేతలుగా, శ్రీకాకుళానికి చెందిన బాబురాజ్, దూండీ సింగ్ రన్నర్లుగా నిలిచారు, 60 ప్లస్ విభాగంలో అనంతపురానికి చెందిన సలీం, శంకరరావు విజేతలుగా, భువనేశ్వర్‌కు చెందిన ఎస్ఎస్ రాక్, పాల్‌చంద్ రన్నర్లుగా నిలిచారు. 70 ప్లస్ విభాగంలో హైదరాబాద్‌కు చెందిన ఏఆర్‌రావు, డాక్టర్ సుధాకర్ విజేతలుగా, శ్రీకాళహస్తికి చెందిన డాక్టర్ చంద్రశేఖర్,అశోక్‌రెడ్డి రన్నర్లుగా నిలిచారు. పట్టణంలోని అఫీషియల్ క్లబ్ కోర్టు, జవహర్ భారతి కళాశాలలోని టెన్నిస్ కోర్టు, తుమ్మల పెంట రోడ్డులోని ఎస్ఆర్ క్లబ్ కోర్టులో పోటీలు జరిగాయి. కావలి రోటరీక్లబ్ వ్యవస్థాపకులు ప్రముఖ సీని యర్ టెన్నిస్ క్రీడాకారుడు, విశ్రాంత జిల్లా వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీనరసారెడ్డి సహాయ సహకారాలతో అనుమలశెట్టి రామకృష్ణ, పీవీ వంశీ మోహన్ పోటీలను నిర్వహించారు. విజేతలకు మెమొంటోలను సీనియర్ టెన్నిస్ క్రీడాకారులు ఆదిశేషారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, అనుమలశెట్టి రామకృష్ణ అందజేశారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

వింజమూరు(ఉదయగిరి): ఉదయగిరి నియోజకవర్గానికి చెందిన 78 మంది బాధితులకు సీఎం సహాయనిధి కింద మంజూరైన కోటి రూపాయల చెక్కులను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వింజమూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా పార్టీలకతీతంగా సీఎం సహాయనిధిని అందించినట్లు తెలిపారు.టీడీపీ నాయకులు చెంచలబాబు యాదవ్, గొంగటి రఘునాథరెడ్డి, సీహెచ్ బయ్యన్న, చంద్రా మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సహకరించాలని వినతి

సీతారామపురం: మండల కేంద్రమైన సీతారామపురంలో లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా నిధులు మంజూరు చేయించి సహకరించాలని టీటీడీ పాలకమండలి సభ్యురాలు, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని ఆలయ కమిటీ సభ్యుడు డీ వెంకటసుబ్బయ్య కోరారు. ఆదివారం ఆయన నెల్లూరులో ప్రశాంతిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో టీటీడీ అధికారులు గ్రామానికి విచ్చేసి ఆలయ నిర్మాణానికి ఎకరా స్థలం కావాలని అడగగా దాతలు సమకూర్చారని తెలిపారు. అనంతరం ప్రక్రియ ప్రారంభించి సంబంధిత ఫైల్‌ను సిద్ధం చేసి టీటీడీ పరిపాలన కార్యాలయంలో అందజేశామని చెప్పారు. అంతలో ఎన్నికల కోడ్ రావడంతో పాటు ప్రభుత్వం కూడా మారడంతో ప్రక్రియ ముందుకు సాగలేదని విన్నవించారు. స్పందించిన ఆమె నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించేందుకు కృషి

- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



బ్లడ్ బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఆనం

ఆత్మకూరు: పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వసతులను కల్పించడం ద్వారా రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన బ్లడ్‌బ్యాంకును ఆదివారం మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రి సమావేశ మందిరంలో నిర్వహించిన అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఆస్పత్రి అభివృద్ధి నిధులపై ఆర్డీఓ బీ పావని, డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నంతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ.28లక్షలతో ఆస్పత్రిలో వేయి లీటర్ల సామర్థ్యం గల ఆర్వో వాటర్ ప్లాంట్, 25కేవీ సామర్థ్యం కలిగిన జనరేటర్, వాహనాల పార్కింగ్ సౌకర్యాలను కల్పించనున్నట్లు తెలిపారు. త్వరలో రోగుల సౌకర్యార్థం లిఫ్ట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు అంచనాలను రూపొందించి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు. బ్లడ్ బ్యాంక్‌లో శిక్షణ పొందిన సిబ్బందిని ఏర్పాటు చేయాలని డీఎంహెచ్‌ఓకు సూచించారు. ఈ సందర్భంగా స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మాసిస్టులు తమను రెగ్యులర్ చేయాలని, ఏళ్ల తరబడి ఒకే చోట పనిచేస్తున్న తమకు బదిలీ అవకాశం కల్పించాలని మంత్రికి వినతి పత్రాలు అందజేశారు. అలాగే ఆస్పత్రి ఎదుట పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంత్రి ఆనం ప్రారంభించారు. ఆర్ఎంఓ డాక్టర్ ఉషాసుందరి, డాక్టర్ బాలాజీ, డాక్టర్ మూర్తి, నర్సింగ్ సూపరింటెండెంట్ కృష్ణకుమారి, టీ గిరి నాయుడు, కంచి పరమేశ్వరరెడ్డి, కే సుధాకర్‌రెడ్డి, కే రవీంద్రారెడ్డి, ఐవీ రమణారెడ్డి, ఎంపీపీ కే వేణుగోపాల్‌రెడ్డి, చంద్రారెడ్డి, పులిమి శైలజ, పిడికిటి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ గ్రహీతలకు సత్కారం



ఆత్మకూరు: పట్టణానికి చెందిన ప్రముఖ రచయిత్రి దోర్నాదుల సుబ్బమ్మ రచనలపై పరిశోధనలు సాగించి డాక్టరేట్లు పొందిన అధ్యాపకులను తెలుగుభారతి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. పట్టణంలోని సేవా సమితి కార్యాలయంలో డాక్టర్ కోసూరి కొండయ్య, డాక్టర్ వేలూరి భారతి, మధురై కామరాజ్ వర్సిటీలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్న డాక్టర్ జీ వెంకటరమణను రచయిత్రి సుబ్బమ్మ కుమారుడు ఫిషరీస్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ రవీంద్రారెడ్డి చేతుల మీదుగా శాలువాలతో సన్మానించారు. పలువురు వక్తలు సుబ్బమ్మ రచనలను కొనియాడారు. సేవా సమితి అధ్యక్షుడు ఎస్ సుబ్బరాయుడు, యానాదిరెడ్డి, కేవీ శేషారెడ్డి, ఎస్వీ రమణయ్య, ఒమ్మిన సుబ్రమణ్యం, వెలిశెట్టి నారాయణరావు, దాత కంచి పరమేశ్వరరెడ్డి, కే రవీంద్రకుమార్, లైబ్రేరియన్ శ్రీనివాసరాజు, టీసీవీ సుబ్బయ్య, రామమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం



కావలి: పట్టణంలోని బుడంగుంటలోని ప్రాథమికోన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. 1990–91 బ్యాచ్‌కు చెందిన ఏడో తరగతి విద్యార్థులు ఒకరినొకరు కలుసుకుని గత స్మృతులను నెమరువేసుకున్నారు. గురువులు దేవదానం, దయాకర్‌ను సత్కరించారు.

పల్లెలపై దొంగల పంజా

- పట్టపగలే గంటల వ్యవధిలో
- ఆధారాలు సైతం దొరక్కుండా చోరీలు
- భారీగా సొత్తు, నగదు అపహరణ
- పోలీసులకు సవాల్ విసురుతున్న దొంగలు



నందిగుంటలో దొంగలు కట్ చేసిన కిటికీని పరిశీలిస్తున్న పోలీసులు(ఫైల్)

ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గంలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. పట్టపగలే ఇళ్లలోకి చొరబడి గంటల వ్యవధిలో విలువైన సొత్తు, నగదును దోచేస్తున్నారు. ముఖ్యంగా హైవే పక్కనున్న పల్లెలను లక్ష్యంగా చేసుకుని తమ హస్తలాఘవాన్ని ప్రదర్శిస్తున్నారు. ఆధారాలు సైతం దొరక్కుండా చోరీలు చేస్తూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. గత నెలరోజుల వ్యవధిలో వరుసగా జరుగుతున్న చోరీలతో ప్రజలు ఆందోళనలు చెందుతున్నారు.

- గత పదిహేను రోజుల క్రితం కలిగిరి మండలం బసిరెడ్డిపాళెం గ్రామంలో హైవే పక్కనే ఉన్న ఓ ఇంట్లో దొంగలు చోరీకు పాల్పడ్డారు. ఉదయం ఇంట్లోని వారు పొలం పనులకు వెళ్లగా దొంగలు తాళం పగలగొట్టి లోనికి చొరబడి నగదును అపహరించుకెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన కుటుంబసభ్యులు తాళం పగలగొట్టి ఉండడం గమనించి లబోదిబోమన్నారు.
- ఈ నెల 17వ తేదీన వింజమూరు మండలం నందిగుంటలో జాతీయ రహదారి పక్కనే ఉన్న షేక్ ఖాదర్‌బాషా ఇంట్లో పట్టపగలే దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఉదయం ఖాదర్‌బాషా దంపతులు పొలం పనికి వెళ్లగా ఇంటి కిటికీ కమ్ములు కట్ చేసి లోపలికి ప్రవేశించారు. బీరువాను పగలగొట్టి అందులో ఉన్న 11 సవర్ల బంగారం, లక్ష రూపాయల నగదు అపహరించారు. మధ్యాహ్నం ఇంటికి తిరిగొచ్చిన ఖాదర్‌బాషా దంపతులు దొంగతనాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- ఈ నెల 21వ తేదీన కొండాపురం మండలం గుడవల్లూరులో చిమిలి మహేష్ ఇంట్లోనూ పట్టపగలే దొంగలు చోరీకి పాల్పడ్డారు. మహేష్ తన కుటుంబ సభ్యులతో హైదరాబాదులో జీవనం సాగిస్తున్న క్రమంలో దొంగలు ఇంటి తాళాన్ని పగలగొట్టి లోనికి ప్రవేశించారు. ఇంట్లోని వివిధ వస్త్రాలను చిందరవందరగా పడేశారు. రూ.3 వేలు నగదును చోరీ చేశారు.
- ఈ నెల 22వ తేదీ ఉదయం వరికుంటపాడు మండలం భోగ్యంవారిపల్లెలో జాతీయ రహదారి పక్కనే ఉన్న భోగ్యం నాగభూషణం ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఉదయం ఇంటికి తాళం వేసి కూల్‌డ్రింక్ షాపునకు వెళ్లిన నాగభూషణం మధ్యాహ్నం వచ్చి చూడగా గేటుతాళాలు, ఇంటి తాళం, బీరువా పగలగొట్టి ఉన్నాయి. బీరువాలోని సుమారు రూ.10వేల నగదు, 10తులాల వెండిని దొంగలు దోచుకెళ్లారు. అదే రోజు మధ్యాహ్నం మండల కేంద్రమైన దుత్తలూరు సెంటర్‌లో సమీపంలోని భగవాన్ శ్రీవెంకయ్య స్వామి ఆలయం వద్ద జాతీయరహదారి పక్కన ఉన్న చింతనబోయిన నరేష్ ఇంట్లో ఎవరూ లేకపోవడం గమనించి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఇంటి గేటు తాళంతో పాటు ప్రధాన ద్వారం తలుపు తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాను పగలగొట్టి అందులోని 11 సవర్ల బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. అంతా 15 నిమిషాల వ్యవధిలోనే దొంగలు పని పూర్తి చేశారు. ఈ ఘటన కేవలం పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే జరిగింది. వరికుంటపాడులో సైతం పోలీసు స్టేషన్‌కు 2కిలోమీటర్ల దూరంలో ఉండే ఇంట్లోనే పట్టపగలే దొంగలు చోరీకి పాల్పడ్డారు. హైవే పక్కనున్న ఎవరూ లేని ఇళ్లనే లక్ష్యంగా చేసుకుని ఒకే తరహాలో చోరీలకు పాల్పడడం గమనిస్తే దొంగలు ఎంతో నైపుణ్యం కలిగిన వారిగా తెలుస్తోంది. ఎలాంటి భయం, బెణుకు లేకుండా కారులో తిరుగుతూ చోరీలు చేస్తున్నట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. పక్కరాష్ట్రాలకు చెందిన ముఠాగా భావిస్తున్నారు. దొంగలు తెలివిగా ఎలాంటి ఆధారాలు లభించకుండా చోరీలు చేస్తుండడం పోలీసులకు ఇబ్బందిగా మారింది. వరుస చోరీలతో రేపు ఏమి జరుగుతుందో అనే భయంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మరి చోరీలను పోలీసుల ఎలా ఛేదిస్తారో వేచి చూడాలి.

ఈ - ట్రై సైకిళ్ల పంపిణీ



ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గంలోని 150 మంది దివ్యాంగులకు రూ.60 లక్షల విలువజేసే ఈ –ట్రైసైకిళ్లను వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పంపిణీ చేశారు. పట్టణంలోని ఎస్సార్డేడీ కళాశాల గ్రౌండ్స్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో పాటు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హాజరయ్యారు. అనంతరం ప్రత్యేక వేదికపై కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలతో మంత్రి, ఎంపీలు ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నామని మంత్రి వెల్లడించారు. ఆర్డీఓ పావని, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, నియోజకవర్గ ఇన్‌చార్జి రమణ, మాజీ ఎమ్మెల్యేలు కొమ్మి లక్ష్మయ్యనాయుడు, శ్రీహరినాయుడు, గిరినాయుడు, ధనుంజయరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, కమిషనర్ గంగాప్రసాద్, సోమశిల ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కేశవచౌదరి తదితరులు పాల్గొన్నారు.